# బొప్పాయి



**ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయం**

ఉద్యాన పరిశోధనా స్థానం

అనంతరాజుపేట, కడప జిల్లా - 516 105

# బొప్పాయి

బొప్పాయి అత్యధిక పోషక విలువలుగల పండు. దీనిలో విటమిన్-ఎ మరియు సి, ఇనుము, కాల్షియం, భాస్వరము మొదలైనవి అధికముగా ఉన్నాయి.

బొప్పాయిని కేవలము పండులానే కాకుండా కాయనుండి వచ్చే పాలతో 'పపెయిన్' అనే ఎంజైమును తీసి మందులు మరి యు ఇతర పరిశ్రమలలో ఉపయోగిస్తారు.

**వాతావరణము :** బొప్పాయి ఉష్ణమండలపు పంట. ఇది మంచును మరియు గాలులను తట్టుకోలేదు.

**నేలలు :** అన్నిరకాల నేలలలో పెంచవచ్చును. మురుగు నీరు పారే నేలలు అనుకూలము.

**రకములు :** బొప్పాయిలో రెండు రకాల మొక్కలు ఉంటాయి. డైయాషియస్ - ఆడ మరియు మగ పుష్పముగల చెట్లు విడి విడిగ ఉంటాయి. గైనోడైయిషియస్ రకాలలో మగ మొక్కలుండవు. కావున పాదుకి ఒక మొక్కనాటితే చాలు. వీటిలో కూర్గ్ హనీడ్యూ, సోలో, కో-3, పూసా డెలీషియస్, పూసామెజస్టీ ముఖ్యమైనవి డైయాషియస్ రకాలలో వాషింగ్టన్, కో-1, కో-2, కో-4, కో-5, కో-6, పూసా జెయింట్, పూసాడ్వార్ఫ్, పూసానన్హా, హనీడ్యూ ముఖ్యమైనవి. వీటిని సాగుచేయునపుడు 2-3 మొక్కలు చొప్పున నాటి, పూత వచ్చిన తరువాత 10 ఆడ మొక్కలకి ఒక మొగ మొక్క ఉంచి మిగతావాటిని తీసివేయాలి.

**ప్రవర్ధనం :** ఒక హెక్టారులో నాటుటకు 250 గ్రాములు విత్తనం సరిపోతుంది. బొప్పాయి పండునుండి తీసిన విత్తనములు 45వ రోజు నుండి మొలక శాతం తగ్గుతుంది. జూన్ నుండి అక్టోబరు వరకు నారు పెంచుటకు అనువైన కాలం. నారు పెంచుటకు

22.5 సెం.మీ. × 15.0 సెం.మీ. పరిమాణం, 150 గేజి మందం, 2-3 రంధ్రములుకల పాలిథీన్ సంచులలో ఎరువు, మట్టి, ఇసుక సమపాళ్ళలో నింపాలి. ప్రతి సంచికి 2 లేక 3 విత్తనములుంచి, మొలకెత్తిన తరువాత ఒకటి మాత్రమే ఉంచాలి. రకాన్నిబట్టి మొక్కల మధ్య 2.5 మీ. నుండి 3.0 మీటర్ల దూరంలో 40×40×40 సెం.మీ. గుంతలలో నాటాలి. రెండు నెలలు వయస్సుగల మొక్కల ను సాయంత్రంపూట నాటాలి.

**ఎరువులు** : అధిక దిగుబడులకు మొక్కకు ప్రతి సంవత్సరం 25 కిలోల పశువుల ఎరువు, 25 గ్రాముల నత్రజని, 250 గ్రా॥ భాస్వరం 500 గ్రాముల పొటాష్ ఎరువులను నాటిన 2వ నెల నుండి 6 దఫాలుగా, 60 రోజుల కొకసారి పాదులచుట్టు వేసి మట్టి కప్పాలి. అవసరంబట్టి శీతాకాలంలో 10 రోజులకొకసారి వేసవిలో 6 రోజుల కొకసారి కండమునకు తగులకుండా నీరు పెట్టాలి.

**పంట కోత, దిగుబడి** : బొప్పాయి నాటిన మొదటి సంవత్సరం నుండి కాపుకి వస్తాయి. 2,3వ సంవత్సరమంతా లాభసాటి దిగుబడినిస్తాయి. హెక్టారుకు 75 నుండి 100 టన్నుల పండ్లు దిగుబడి వస్తుంది.

**పాల సేకరణ** : పాలను తీయుటకు 70-90 రోజుల వయసున్న బొప్పాయి కాయ పొడుపున నాలుగు వైపుల 3 మి.మీ లోతు ఉండేలాగా పదునైన కత్తి లేదా బ్లేడుతో గాట్లు పెట్టాలి. దీనిని ఉదయం 9 గంటలలోపు చేయాలి. కారేపాలను కొబ్బరి చిప్పలలో కానీ అల్యుమినియం లేదా గాజు పాత్రలలో కానీ సేకరించాలి. ఇలా ఒక కాయనుండి పాలను 4 రోజుల వ్యవధిలో 4 సార్లు సేకరించాలి ఇలా సేకరించిన పాలను, లీటరుకు 500 మి.గ్రా. పొటాషియం మెటాబైసల్ఫేటును కలిపి 38$^{o}$C కన్న తక్కువగాయున్న ఎండలో ఆరబెట్టినచో ఎక్కువ రోజులు నిలువ ఉంటుంది. పాలని పొరలు పొరలుగా వచ్చేవరకు ఆరనిచ్చి మెత్తని పొడిగా చేసి పాలిథీన్ లేక ఉలిపిరి సంచుల్లో నిలువ చేసుకోవచ్చు పాలుతీయటానికి

జూలై, ఆగస్టు నెలలు అనుకూలంగా ఉండి అధికంగా పపెయిన్ దిగుబడినిస్తాయి. కో-2, కో-4 సెలక్షన్-7 రకాలు పపెయిన్‌ను సేకరించుటకు బాగా అనువైనవి రకాన్నిబట్టి ఒక మొక్కనుండి సంవత్సరానికి 500-750 గ్రా. ఎండు పపెయిన్ వస్తుంది.

## సస్యరక్షణ

**1. నులి పురుగులు** : ఇది బొప్పాయి మొలక దశనుండి పెద్ద చెట్ల వరకు మొక్క వేర్లను ఆశించి, వాటి పెరుగుదలను ఆపుచేస్తుంది. వీటి నివారణకై 100 సంచులలో సరిపడే మట్టికి 500 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలుకాని వేపపిండికాని కలిపి నారుపోసుకోవాలి.

**2. నారు కుళ్ళు తెగులు** : నారు దశలో మొక్కలు కుళ్ళిపోతాయి నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొక్కలపై ఫైటాలాన్ లేదా బ్లయిటాక్స్ 0.3% ద్రావణాన్ని పిచికారి చేయాలి.

**3. కాండము కుళ్ళు తెగులు** : వర్షాకాలంలో ఈ తెగులు ఎక్కువగా ఆశించును. కావున మురుగునీరు పోయే వసతి కల్పించి పైన చెప్పిన మందులను మొదలు తడిచేటట్లు పిచికారి చేయాలి.

**4. మొజాయిక్ మరియు ఆకుముడత** : పేనుబంక వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కలు పెరుగుదల ఆగిపోయి, ఆకులు పసుపుపచ్చగా మారి కాడలు క్రిందికి వంగి పోయి చివరకు మొక్కలు చనిపోతాయి. ఆశించిన మొక్కల ను గుర్తించి వెంటనే కాల్చివేయాలి. దీని వ్యాప్తిని అరికట్టేందుకు డైమెథోయేట్ 0.2% లేదా మోనోక్రోటోఫాస్ 0.175% పిచికారి చేయాలి.